మువ్వన్నెల కాంతులతో కాచిగూడ స్టేషన్



చారిత్రక కాచిగూడ రైల్వేస్టేషన్ మువ్వన్నెల కాంతుల మధ్య ధగధగలాడుతోంది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో దక్షిణమధ్య రైల్వే అధికారులు స్టేషన్‌ను ఇలా మూడు రంగుల విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు.

- బర్కత్‌పుర, మే 15 (ఆంధ్రజ్యోతి)

ప్రజాసంక్షేమం కోసం పనిచేసే వారికి ప్రాధాన్యం



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ముఠా గోపాల్

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం కోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులకు బీఆర్ఎస్‌లో తగు ప్రాధాన్యం ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డమీది శ్రీనివాస్‌ను ఆయన గురువారం జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ శ్రీనివాస్ చేస్తున్న పార్టీ, ప్రజాసేవ స్ఫూర్తిదాయకమన్నారు. కరోనా సమయంలో కూడా శ్రీనివాస్ తనవంతుగా సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఠానరేష్, ముడారపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయి పీసీసీ కమిటీని వేసుకోలేని కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ పార్టీపై ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీని చక్కదిద్దుకోలేని కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులు హరీష్‌రావు బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తారని, కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం చేస్తారని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు మానుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ బలంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

హుస్సేన్‌సాగర్ నాలాలో పూడికతీత పనులు ప్రారంభం

కవాడిగూడ, మే 15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ నాలాలో పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. వర్షాకాలం వచ్చిన ప్రతిసారి నాలాలో వరద నీరు పెరిగి నాలా పరివాహక ప్రాంతాలైన సుభాష్‌చంద్రబోస్‌నగర్, అంబేడ్కర్‌నగర్, సూరజ్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని అశోక్‌నగర్ ధోబీఘాట్ వద్ద నాలా పూడిక తీత పనులకు ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలా పూడికతీత తరువాత మట్టిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు చిత్ర కుమార్‌గౌడ్, నాయకులు బొల్ల రమేష్, జీహెచ్ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి'

బర్కత్‌పుర, మే 15(ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని పలు బస్తీలలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. గురువారం డివిజన్‌లోని లింగంపల్లి చౌరస్తా నుంచి శ్రీగణేష్ ఆలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు పైప్‌లైన్ల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్ బీజేపీ నాయకులు బల్వీర్, క్షీరసాగర్, ఎం.నర్సింగ్‌రావు, అరవింద్, భీమ్‌రాజ్, రాహుల్, వాసు, రాజ్‌కుమార్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బాపూజీ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు'

ముషీరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం డివిజన్‌లోని బాపూజీనగర్ సద్గురు టెంట్‌హౌస్ వద్ద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్‌కు వివరించారు. స్పందించిన కార్పొరేటర్ సొంత డబ్బులతో డ్రైనేజీ పైప్‌లను తెప్పించి పైప్‌లు వేయించారు. అనంతరం రోడ్డు పనులు పునర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు రాజు, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవం సమ్మర్ క్యాంపు

రాంనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6 నుంచి కొనసాగుతున్న రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపు గురువారం ముగిసింది. ఈ క్యాంపులో 60 మంది విద్యార్థులు 10 రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్ష, కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి పాల్గొని సమ్మర్ క్యాంపులో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. 10 రోజుల పాటు విద్యార్థులకు యోగాతో పాటు పలు క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలలో లాల్‌బహదూర్ స్కూల్ ప్రిన్సిపాల్ అంకమ్మ, ప్రొఫెసర్ చంద్రయ్య, విజ్ఞాన దర్శిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా

- వాటర్ పిల్లర్ల వద్ద తాగునీరు కొనుగోలు
- ఇబ్బందులు పడుతున్న హరినగర్ వాసులు
- పట్టించుకోని అధికారులు



హరినగర్‌లో నల్లా ద్వారా వస్తున్న కలుషిత నీటిని చూపిస్తున్న మహిళలు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని హరినగర్, అబ్బసాయిమెన్షన్ ఏరియా, కృష్ణనగర్, ఎస్ఆర్‌టీ కాలనీ, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు రంగుమారి తాగడానికి, ఇతర అవసరాలకు వాడుకోవడానికి వీలులేకుండా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ పిల్లర్ల వద్ద క్యాన్లలో తాగు నీటిని కొనుగోలు చేసి తాగుతున్నామని స్థానిక మహిళలు తెలిపారు. ఇతర అవసరాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నల్లా ద్వారా సరఫరా అయిన రంగుమారిన తాగునీరు

డీజీఎంకు ఫిర్యాదు చేశాం



హరినగర్‌లో నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని చిలుకలగూడ జలమండలి డీజీఎం మోహన్ దాసుకు ఫిర్యాదు చేశాం. బాకారంలో కొత్త పైప్‌లైన్ వేయడంతో అందులో మట్టి చేరి నీరు రంగు మారిందని తెలిపారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

- ముదిగొండ మురళీ, హరినగర్

తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణ : ఎమ్మెల్యే కాలేరు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణతో పాటు నూతన సీసీ రోడ్లు, పార్కుల సుందరీకరణకు లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధురనగర్‌లో రూ.38 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకులు ఆఫ్రోజ్‌పటేల్, కె.నర్సింగ్, మిరియాల రవీందర్, రమేష్‌నాయక్, శివ, చంద్రశేఖర్‌గౌడ్, సంతోష్, ఆర్‌బీఐ రమేష్, గోవింద్ అర్జున్, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, ఏఈ మాజీద్, డీఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వృత్తి రక్షణ కల్పించాలి



మహాధర్నాలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్ ముదిరాజ్

కవాడిగూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): మత్స్య కార్మికులకు వృత్తి రక్షణ, ఉపాధి, జీవిత భద్రత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మికసంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పిట్టల రవీందర్‌లు మాట్లాడుతూ కేంద్రంలో గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చేపలవేటకు వెళుతున్న మత్స్యకారుల జీవిత భద్రత కోసం ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా వంటి స్కీములు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాబార్డు వంటి బ్యాంకుల ద్వారా మత్స్యకారులకు ఇచ్చే రుణాలను కేంద్రప్రభుత్వం నిలిపివేసిందని, వాటిని పునరుద్ధరించాలని అన్నారు. జలవనరులను, రిజర్వాయర్లను మత్స్యకారుల నుంచి దూరం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తుందని వారు మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మత్స్యపరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేంద్రం రూ.లక్ష కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదువేల కోట్ల నిధులను కేటాయించాలని, రక్షణ చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం నాయకులు కొప్పుపద్మ, బోడంకి చందు. శీలం శ్రీను, మత్స్యకారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్‌లు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్ తదితరులు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్‌లను అందజేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్, గ్రాట్యుటీ, వేతన సవరణ బెనిఫిట్, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్మెంట్‌కు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు, పెళ్లిళ్లు, చదువులకు కావాల్సిన డబ్బులు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులకు తీసుకువచ్చి వాటిని చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు రావల్సిన బెనిఫిట్స్ అందించాల్సి పోయి కమిషన్లు తీసుకుని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మే 15(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం డివిజన్‌లోని నరేంద్రనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీలో డ్రైనేజీ నిండి ఉండడంతో సంబంధిత సిబ్బందిని పిలిపించి డీ సిల్టింగ్ చేయించారు. మూతలు లేని మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రదీప్, బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25న వరల్డ్ రికార్డు కోసం అక్కా చెల్లెలు జి.అమృతారెడ్డి, జి.ఘనసంతోషిణి రెడ్డి కరాటే ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జీవీఆర్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, మే 15(ఆంధ్రజ్యోతి)

సెల్ఫీ తీసుకుని యువకుడి ఆత్మహత్య

అంబర్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవితంలో అనుకున్న లక్ష్యాలు సాధించలేదని, తన వల్ల కుటుంబానికి ఉపయోగం లేదని సెల్ఫీ తీసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ఇందిరానగర్‌లో నివాసముండే మహ్మద్ మన్సూర్ కుమారుడు కబీర్(24) ఎంబీఏ చదివాడు. కొద్ది కాలంగా ఆయన ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన కుటుంబానికి భారమవుతున్నానని బుధవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం 7గంటల వరకు ఆయన తన గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు కిటికీ తెరచి చూడగా కబీర్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా కబీర్ అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు చోరీ చేసే పాత నేరస్థుడు అరెస్ట్

చిక్కడపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు చోరీలు చేసే పాత నేరస్థుడిని చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో మూడు వాహనాలు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్, డీఐ ఎం.శంకర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. గత జనవరి 4న తన హోండా యాక్టివా ద్విచక్రవాహనం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో పార్క్ చేయగా చోరీ అయిందని డీవీ సురేష్‌బాబు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు దాదాపు 30 సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ క్రమంలో అప్పటికే పన్నెండు ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో శిక్షను అనుభవించిన ముషీరాబాద్ పార్సిగుట్టకు చెందిన మంతెన కృష్ణంరాజు అలియాస్ కృష్ణ(44) సురేష్‌బాబు వాహనంతో పాటు నగరంలోని పలు పీఎస్‌ల పరిధిలో మరో ఏడు వాహనాలు చోరీ చేసినట్లు తేలింది. గురువారం కృష్ణంరాజును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ల్యాప్‌టాప్‌ను తస్కరించిన రైల్వే దొంగలు

బర్కత్‌పుర, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉద్యోగి ల్యాప్‌టాప్‌ను రైల్వే దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... చంగిచెర్లకు చెందిన కసిరెడ్డి రాజశేఖర్ ప్రైవేట్ ఉద్యోగి. బెంగళూరు నుంచి కాచిగూడకు రావడానికి మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మలక్‌పేట వద్ద ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగులో ల్యాప్‌టాప్‌తో పాటు సెల్‌ఫోన్, వెయ్యి రూపాయల నగదు, డ్రైవింగ్ లైసెన్స్, ఏటీఎం కార్డులు ఉన్నాయి. గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



అవార్డు ప్రదానం చేసి సత్కరిస్తున్న అతిథులు

ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ పురాతనమైంది

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కుటుంబవ్యవస్థ ఎంతో పురాతనమైందని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. పినానికి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా ఆదర్శ కుటుంబం అవార్డును శోభ, డా. రామచంద్రరావు దంపతులతో పాటు మాధవి, శ్రీనివాసరావు, రేణుక, మధుసూదనరావు, పద్మ, నరసింహులుగౌడ్, సుజాత, శంకర్, ఆమంచ, అంజయ్యలను సర్టిఫికెట్, జ్ఞాపిక, కిరీటధారణతో ఘనంగా సత్కరించారు. మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డులను ప్రదానం చేయగా మురళీమోహన్‌రాజు అధ్యక్షత వహించారు. సినీ దర్శకులు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, రిటైర్డ్ జడ్జి మధుసూదనరావు, సర్వేపల్లి గోపీకృష్ణ, కవయిత్రి రాధాకుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



దేవదాసుకు అవార్డు ప్రదానం చేసి సత్కరిస్తున్న అతిథులు

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయి

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని, వాటిని తీసుకున్నవారు ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేయాలని ట్రాఫిక్ పోలీస్ పూర్వ అదనపు డీసీపీ సుంకర సత్యనారాయణ అన్నారు. కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో చేనేత సామాజిక ఉద్యమనాయకులు, సమాజ సేవకుడు డాక్టర్ చిక్కా దేవదాసుకు ప్రజాప్రపూర్ణ బిరుదును ముఖ్యఅతిథిగా హాజరైన సుంకర సత్యనారాయణ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాసు తనవంతుగా ఆధ్యాత్మికరంగంలో సేవలు అందిస్తూనే చేనేత కార్మికుల సంక్షేమానికి పాటుపడడం, సంఘసేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషమన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ కవి చిక్కా శంకర్, కళానిలయం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, కె.కిరణ్‌కుమార్ తదితరులు

అంబర్‌పేటలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాలి

నల్లకుంట, మే 15(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడానికి పార్టీశ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం బతుకమ్మకుంటలో అంబర్‌పేట నియోజకవర్గ పార్టీ పరిశీలకులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ కలిసి నియోజకవర్గ, డివిజన్ల అధ్యక్షుల నియామకంపై చర్చించి అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల పార్టీ అధ్యక్షుల జాబితాను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భానుప్రకాష్, సత్యనారాయణ, పరుశరామ్, ఓ.వెంకటేష్‌చౌదరి, చారి, నర్సింహగౌడ్, ప్రకాష్, చారి, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



కోటా నీలిమను సత్కరిస్తున్న రమణారావు

నల్లకుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణులకు సరైన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఏఐసీసీ సభ్యురాలు కోటా నీలిమను నగరంలోని ఆమె నివాసంలో కలిసి శాలువాకప్పి సత్కరించి, వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. గురువారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవులతో పాటు పార్టీల్లో అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, కానాల శ్యాంసుందర్‌రావు, కోశాధికారి మంత్రి సునీల్, సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్, గూడ జయరాం, రఘు, కాశీభట్ల కేశవశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, వేదపారాయణములు, పల్లకీసేవ, మహానివేదన తదితర కార్యక్రమాలను ఆలయ ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. దేవాలయం వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. రాత్రి స్వామివారి గజవాహనసేవ చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధులగుండా అత్యంత వైభవంగా నిర్వహించారు.

నేడు అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ముషీరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో నీవి చారిటబుల్ ట్రస్ట్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం (నేడు) అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్ తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండు రోజులపాటు జరుగుతాయని తెలిపారు. మొదటి రోజు ఉదయం 10గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రికెట్ పోటీలు ప్రారంభిస్తారని తెలిపారు. క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

నల్లకుంటలో కూలిన భారీ వృక్షం

నల్లకుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని మూన్‌కేఫ్ ఎదురు వీధిలో గురువారం ఉదయం 6 గంటల సమయంలో కురిసిన వర్షం వల్ల ఓ భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల ఫిర్యాదు మేరకు బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి వెంటనే డీఆర్ఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే డీఆర్ఎఫ్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని కూలిపోయిన భారీ వృక్షం చెట్టు కొమ్మలను కట్ చేసి తరలించారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

అంబర్‌పేట, మే 15(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో విద్యార్థులు ఆడుకోవడానికి అవసరమైన క్రీడా సామగ్రిని బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ చేశారు. గురువారం పటేల్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థులకు క్రికెట్ కిట్, షటిల్స్, బ్యాట్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, శారీరకంగా, మానసికంగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నజయ్ ముదిరాజ్, ఆకుల మల్లేష్, నరేందర్, బొట్టు మహేష్, సురేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.